క్లుప్తంగా

కౌలు రైతులు సాగుహక్కు పత్రాలు పొందాలి

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో పంటలు కౌలుకు సాగు చేస్తున్న రైతులు పంట సాగుహక్కు పత్రాలు పొందాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. ఎంజీపురం, సుంకిడి పంచాయతీల్లో సాగుహక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను, గ్రామ రెవెన్యూ అధికారులను కలిసి సాగు హక్కు పత్రాలు పొందవచ్చునని సూచించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

టెక్కలి ఎంపీడీవోగా ఫణీంద్రకుమార్

టెక్కలి: టెక్కలి ఎంపీడీవోగా కె.ఫణీంద్రకుమార్ పూర్తి అదనపు బాధ్యతలు మంగళవారం స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సీహెచ్ లక్ష్మీబాయి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అదే స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరిస్తూ ఫణీంద్రకుమార్ విధుల్లోకి చేరారు. ఈయన నందిగాం, కోటబొమ్మాళి మండలాల్లో ఎంపీడీవోగా పనిచేశారు.

ఆలయ పునః ప్రతిష్ట మహోత్సవం

సోంపేట: బారువ గ్రామంలో కొలువై ఉన్న కోటిలింగేశ్వర స్వామి దేవాలయం పునః ప్రతిష్ట మహోత్సవ పూజా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఎమ్మెల్యే బి.అశోక్, మాజీ ఎమ్మెల్యే జి.శివాజీ, అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మండపం నిర్మాణానికి రూ. 20 వేల సాయం

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల పంచాయతీ కేంద్రంలో మండపం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు రూ.20 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. కమిటీ సభ్యులు ఆయన్ని అభినందించారు.

యోగాతో ఆరోగ్యం



యోగాపై శిక్షణలో అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తహసీల్దార్ ఎస్.వెంకటరావు అన్నారు. యోగాంధ్రాలో భాగంగా డొంకూరు గ్రామంలో యోగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో కె.రామారావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో భక్తజనం

వజ్రపుకొత్తూరు: సీతాపురంలో 14 ఏళ్ల తర్వాత జరుగుతున్న కాళీమాత సంబర మహోత్సవ కార్యక్రమంలో మొదటి రోజైన మంగళవారం ఘటాల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పాతపట్నం అమ్మవారు, గట్టు పోలమ్మ, పోతయ్య అమ్మవారులకు ముర్రాటలతో చల్లదానం చేశారు. పాతపట్నం అమ్మవారి దాసురాలు తమ్మినాన లచ్చమ్మ, కాళీమాత దాసుడు తమ్మినాన ఢిల్లీరావులను భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు పాగడాలు పరిచి భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను కొలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, పౌరాణిక ఘట్టాలు, పగటి వేషాలు అలరించాయి.

కొనసాగుతున్న రేషన్ కష్టాలు



టెక్కలిలోని ఓ డిపో వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం చేసిన కుటిలమైన కుట్రతో లబ్ధిదారులకు రేషన్ కష్టాలు కొనసాగుతున్నాయి. మంగళవారం టెక్కలిలో పలు రేషన్ డిపోల వద్ద రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. ఒక వైపు సర్వర్ సమస్యలు, మరో వైపు విద్యుత్ అంతరాయంతో రేషన్ అందని పరిస్థితి నెలకొంది.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో గల అభయ ప్రసన్నాంజనేయ స్వామి ఆలమ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, హోమం చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను తిరువీధి నిర్వహించారు.

సంక్షేమానికి సమాధి!

- కూటమి ప్రభుత్వ పాలనలో కానరాని సంక్షేమం
- అమలు కాని ఎన్నికల హామీలు
- సూపర్ సిక్స్ జాడే లేదు



రాష్ట్రంలోని కూటమి సర్కార్ సంక్షేమానికి సమాధి కట్టింది. అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీ జాడే లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇంకా రోడ్డెక్కలేదు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల హామీ ఒక్క నెలకే పరిమితమై మంటల్లో కలిసిపోయింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించిన దాఖలాల్లేవు. బ్యాంక్ లావాదేవీలు లేవంటూ కొందరికీ, ఎన్‌పీసీఐ లింక్ లేదంటూ మరికొందరికీ, ఫోన్ నంబర్ యాడింగ్ లేదని మహిళలను బ్యాంకుల వద్దకు, సచివాలయాల వద్దకు తిప్పుతూనే ఉన్నారు. పేదవారు కూడా ఉన్నత విద్య చదువుకోవాలన్న ఆశను అడియాసలు చేసేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని జనం మండిపడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా రైతులకు విత్తనాలు అందని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగ భృతి హామీని పూర్తిగా మరిచిపోయారు. ఇదే సమయంలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ను సక్రమంగా అమలు చేసేవారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. నవరత్నాలు పేరిట ప్రజల్లోకి వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డి అనుకున్న మాదిరిగా పార్టీలకతీతంగా పథకాలు అమలు చేయడంతో పాటు నేరుగా వారి ఖాతాల్లోకే నగదు జమ చేసిన విషయాన్ని మరిచిపోలేకపోతున్నారు. రెండేళ్లు కరోనా మహమ్మారి వణికించినప్పటికీ.. ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు ఏమాత్రం ఆపలేదని జనం చెబుతున్నారు. కూటమి సర్కార్ ఏర్పాటై ఏర్పాటై ఏడాది పూర్తయిన నేపథ్యంలో సంక్షేమ పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారోనని ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని లక్షలాది మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. –సాక్షి నెట్‌వర్క్



నేతన్నలను విస్మరించారు..!



టెక్కలి: కె.కొత్తూరులో మగ్గంపై నేతనేస్తున్న చేనేత కార్మికురాలు (ఫైల్)



వైఎస్సార్ నేతన్న నేస్తం కానుక సందర్భంగా టెక్కలి మండలం కె.కొత్తూరులో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కుటుంబాలు (ఫైల్)

టెక్కలి: గ్రామాల్లో మగ్గంపై ఆధారపడి చేనేత వస్త్రాలను తయారు చేసే చేనేత కుటుంబాల కోసం గత వైఎస్సార్‌సీపీ హయాంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఆలోచనతో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం ద్వారా మగ్గం ఉన్న ప్రతీ చేనేత కార్మికుడికి ఏటా రూ. 24 వేలు సాయం అందజేసి తద్వారా వారికి ఆర్థికంగా భరోసా కల్పించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మగ్గంపై ఆధారపడిన నేతన్నలకు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో మరళా వలస బాట పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా 61 మంది చేనేత కార్మికులకు సుమారు 73,20,000 రూపాయలు అందజేశారు. దీంతో పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడేది. ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేకపోవడంతో మరళా దీనావస్థకు చేరుకుంటున్నారు.

చేనేత కార్మికులను పట్టించుకోరా?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మగ్గం ఉన్న ప్రతీ చేనేత కార్మికుడికి ప్రతీ ఏడాది రూ. 24 వేలు అందజేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కుటుంబాలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కొంత మంది మగ్గాలను ఆపివేస్తున్నారు. తమను పట్టించుకోరా. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

–ఎం.శంకర్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గం చేనేత విభాగం అధ్యక్షుడు, టెక్కలి

రూ. 15 వందలు ఎప్పుడు ఇస్తారు?



ప్రతీ మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో చెప్పారు. ఏడాదైనా ఆ నాయకులు ఇప్పుడు కనిపించడం లేదు. పథకం ఊసేలేదు. గతంలో కూడా చంద్రబాబు పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేశారు. మహిళలకు ఆశ చూపి మోసం చేసిన నాయకుడుకు బుద్ధి చెప్పడం ఖాయం.

– దున్న నిర్మల, ఒకటో వార్డు, మొగిలిపాడు

దర్జీలకు సాయం చేయరా..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దర్జీలకు సంవత్సరానికి పది వేల రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకానికి పంగనామం పెట్టింది. వెనుకబడిన తరగతుల వారికి 50 సంవత్సరాలకు పింఛను అందజేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాల్లో కలిసి పోయింది. కూటమి సర్కార్ అందరినీ మోసం చేసింది.

– సాహుకారి జాని, దర్జీ, జింకిభద్ర, సోంపేట మండలం

ప్రభుత్వం ఘోరంగా విఫలం



సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారనే ఆశతో ఓటు వేసిన ప్రజలను కూటమి మోసం చేసింది. అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం–2 కూడా విఫలమైంది. పింఛన్ల పంపిణీలో గత ప్రభుత్వంతో పోల్చితే లబ్ధిదారుల సంఖ్య ఇప్పుడు బాగా తగ్గిపోయింది. ఏడాది వ్యవధిలోనే ప్రభుత్వం తిరోగమనంలో పయనించడం దురదృష్టకరం.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్, కవిటి మండలం

ఉచిత గ్యాస్ పేరుతో టోకరా



అధికారంలోకి వస్తే ఉచితంగా గ్యాస్ అందజేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఒక సిలిండర్ ఇచ్చారు. అది కూడా కొంత మందికే అందజేశారు. ఉచితం గ్యాస్ పథకం పేరుతో మరోసారి మహిళల్ని దగా చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు కోలుకోలేని వెన్నుపోటు పొడిచింది.

–ఆర్.లక్ష్మీకాంతం, వైస్ ఎంపీపీ, నందిగాం

పథకాల అమల్లో సర్కార్ విఫలం



ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం గడుపుతూ వచ్చారు. కొత్త పింఛన్లను ఇవ్వలేదు. మహిళల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఎలా అమలు చేశారో అందరికీ తెలిసిందే. సబ్సిడీ డబ్బులు ఇప్పటికీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. ఉచిత బస్సు ప్రయాణం, ఆడపిల్లలకు ప్రతి నెల రూ. 1500 జమ, తల్లికి వందనం తదితర పథకాలు అమలు ఊసేలేదు.

–వజ్జ మృత్యుంజయరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మకరాంపురం, కంచిలి మండలం

అన్నదాతకు సాయమేదీ?



గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా సకాలంలో రైతులకు డబ్బులు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు రూపాయి కూడా రైతులు సాయం చేయలేదు. రైతు భరోసా పేరు మార్చి అన్నదాత సుఖీభవగా నామకరణం చేసినా రైతుల ఖాతాల్లోకి డబ్బులు మాత్రం వేయలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తక్షణమే సాయం అందజేయాలి.

– వంకల అప్పారావు, రైతు, బొడ్డపాడు కాలనీ, పలాస మండలం

ఘనంగా చింతామణి సంబరం



ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి మంగళవారం సంబరాన్ని నిర్వహించారు. గ్రామ రైతులు, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, వర్తక, కళాసీ, డ్రైవర్ల సంఘాల ఆర్థికసాయంతో స్థానిక ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంబరంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్‌లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్ద, కాళికావేష ధారణలతో.. మేళతాళాలతో ఊరేగించారు. –కవిటి

జాతీయ నాయకులపై అవగాహన



ఇచ్ఛాపురం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం జాతీయ నాయకుల జీవిత విశేషాలపై పిల్లలకు అవగాహన కల్పించినట్టు గ్రంథాలయ అధికారి పూర్ణచంద్రబెహరా తెలిపారు. అలాగే పిల్లలతో నీతి కథలను చదివించామన్నారు. గ్రంథాలయ సహాయకులు బి.రాజేష్ పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం టౌన్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

కంచిలి: మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందించాలని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో మెనూను తప్పనిసరిగా పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తల్లిలాగ పిల్లలను చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన ఎస్.ఆర్.సి.పురానికి చెందిన కౌసల్య తను నేర్చుకొన్న అంశాలను భోజన నిర్వాహకులకు వివరించారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

కంచిలి: నియోజకవర్గ కేంద్రం ఇచ్ఛాపురం పట్టణంలో బుధవారం నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం'నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ కోరారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు ఇచ్ఛాపురం పట్టణంలోని మెయిన్ రోడ్డు దాసన్నపేట జంక్షన్ నుంచి ర్యాలీ ప్రారంభించి వైఎస్సార్ విగ్రహం వెళ్తామన్నారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన తరువాత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతి పత్రాన్ని అంజేస్తామన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోకవర్గంలోని పార్టీ ముఖ్యనేతలు, మండల పార్టీ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

నిరసన కార్యక్రమానికి తరలిరండి



పేరాడ తిలక్

టెక్కలి: మోసాలే హామీలుగా ప్రజల్ని మభ్యపెట్టి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజల్ని వంచించి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టారని మండిపడ్డారు. ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేశారని తిలక్ గుర్తు చేశారు. ప్రజలకు చేసిన వెన్నుపోటును నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం టెక్కలిలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు.

పార్టీ శ్రేణులు తరలిరావాలి

కవిటి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఇచ్ఛాపురం పట్టణంలో నిర్వహించను న్న 'వెన్నుపోటు దినం'కార్యక్రమానికి వైఎస్సార్ శ్రేణులంతా తరలిరావాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.



ఎమ్మెల్సీ రామారావు

విజయవంతం చేయండి



కాశీబుగ్గ: మాట్లాడుతున్న పార్టీ నాయకులు

కాశీబుగ్గ: కూటమి సర్కార్ మోసాలను నిరసస్తూ బుధవారం చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు కోరారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సంతమైదానంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించే 'వెన్నుపోటు దినం'ర్యాలీకి తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు(బుజ్జి), పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, మున్సిపల్ విప్, కౌన్సిలర్ శంకర్ పండా, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు అంబటి ఆనందరావు, నాయకులు పోతనపల్లి హరిప్రసాద్, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పిచ్చుక అజయ్, మూడో వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ పలాస నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు బమ్మిడి సంతోష్, శర్వాణ రవికుమార్, నర్తు వెంకటరమణ, బమ్మిడి సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం..

టెక్కలి: కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగడుతూ బుధవారం టెక్కలిలో.. నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ప్రజలంతా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఇందులో భాగంగా టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో మంగళవారం నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు టెక్కలి వైఎస్సార్ జంక్షన్ వద్దకు హాజరు కావాలని కోరారు.



టెక్కలిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఉద్దానం ప్రజల ఆదరాభిమానాలు మరవలేనివి

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం ప్రజల ఆదరాభిమానాలకు మంత్ర ముగ్ధుడైయ్యానని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయ్ ఎమ్మెల్యే, బీహార్ ఏఐసీసీ కార్యదర్శి దేవేంద్ర యాదవ్ అన్నారు. ఈ ప్రాంత ప్రజల అభిమానం మరువలేనివన్నారు. మెట్టూరులో మంగళవారం జరిగిన కొండ మహంకాళీ గ్రామ దేవత ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ దేవత ఉత్సవాలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఉద్దానం ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఇక్కడ ప్రజల్లో ఐక్యత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సోదరభావంతో కూడిన అనుబంధం తనకు ఎంతో ఇష్టమన్నారు. తెలుగు ప్రజలంటే ఎంతో అభిమానమని చెప్పారు. ఈ సందర్భంగా మెట్టూరు గ్రామస్తులు ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు లక్ష్మీపతి, మల్లా రవికుమార్, రాజు, కామరాజు, చిరంజీవి, హేమబాబు చౌదిరి, దాసరి జేజేరావు ఉన్నారు.



కాశీబుగ్గ: బిలాయ్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు

దేవేంద్ర యాదవ్‌కు మాజీమంత్రి సత్కారం

కాశీబుగ్గ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్ పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ జీఎంఈ కాలనీలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగృహానికి విచ్చేశారు. ఆయన్ని అప్పలరాజుతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. నాయకులు అంబటి ఆనందరావు, శిష్టు గోపి, బత్తిని హేమేశ్వరరావు, నర్తు రమణ ఉన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

- పలు విషయాలపై సభ్యుల ఆగ్రహం

పలాస: పలాస మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యతన మంగళవారం జరిగింది. వివిధ అంశాలను సభ్యులు ప్రస్తావించడంతో సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక తీర్మానాలు చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక పథకాలు అధికార పార్టీ నాయకులకు కట్టబట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు ఎంపీటీసీ, సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో సర్పంచులను, ఎంపీటీసీలను గ్రామాల్లో కనీసం పట్టించుకోకపోవడం ఏమిటని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఉంగ సాయి క్రిష్ణ ప్రశ్నించారు. కనీసం ప్రొటోకాల్ కూడా పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు జరగాలని తాము కోరుకుంటూ.. ఎటువంటి అడ్డంకులు చెప్పకుండా తీర్మానాలు చేసి పంపుతున్నా అధికారులు తగిన గౌరవం ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో అధికారులు కూడా ఏమి చేయలేరన్నారు. 80 శాతం పనులు కూటమి నాయకులు చేసినా ఆయా గ్రామాల సర్పంచులు చెప్పే 20 శాతం పనులు కూడా చేయక పోవడం సరికాదన్నారు. ఇదేపరిస్థితి కొనసాగితే మొత్తం తీర్మానాలు చేయకుండా ఆపేస్తామని.. ఎవరు ఏమి చేస్తారో తరువాత చూస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద గోశాలలు నిజమైన లబ్ధిదారులకు ఇచ్చారా అంటూ ఎంపీవో శంకరరావును ప్రశ్నించారు. అన్నదాతకు అండగా ఉంటున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం ఎందుకు కొనుగోలు చేయలేదని ప్రశ్నించారు. కూటమి సర్కార్ వచ్చి ఏడాది గడిచిపోతున్నా అన్నదాత సుఖీభవ ఇవ్వలేదన్నారు. అమలు చేయలేని హామీలను ఎందుకు ఇవ్వాలని పలువురు సభ్యులు ప్రశ్నించారు. వంశధార పనులు చేపడుతుండటం సంతోషమే కానీ సక్రమంగా చేపట్టడంలేదని, రైతులకు ఉపయోగపడేలా పనులను చేపట్టాలని వంశధార ఏఈ మీనాక్షిని కోరారు. బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ మాట్లాడుతూ.. రేషను సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా చేరడం లేదని, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సివిల్ సప్లయి డీటీ మురళి మాట్లాడుతూ.. అందరికీ అందేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చినంచల ఎంపీటీసీ బమ్మిడి దుర్యోధన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉన్నాయని వాటిని సరిచేయాలని కోరారు.

ఇష్టానుసారంగా బిల్లులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఈవో శ్రీనివాసరావు విద్యావ్యవస్థలో మార్పులను వివరించారు. సమావేశంలో ఎంపీడీవో కె.వసంతరావు, మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖరరావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపీపీ సవర దాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మద్దిల పాపారావు, కోరాడ నిరోషా, కొర్ల శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ అధికారిని ప్రశ్నిస్తున్న మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయిక్రిష్ణ

యోగాతో మెరుగైన ఆరోగ్యం

మనిషి దైనందిన జీవితంలో యోగా నిత్యకృత్యంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందవచ్చని ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. కవిటి మండలంలోని కొత్తపాలెం సముద్రతీరంలో మంగళవారం ఉదయం వందలాది మందితో సామూహిక యోగాసనాల సాధన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. తహసీల్దార్ మురళీమోహనరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ధనంజయమజ్జి తదితరులు పాల్గొన్నారు. –కవిటి

